సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 21 । జూన్ । 2024



తెరచుకున్న దుఃఖాణాలు


జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు రూ.వేలకు వేలు ఫీజులు గుంజుతూనే పుస్తకాలు, బ్యాగ్‌లు, చివరకు షూ సైతం తమ వద్దనే తీసుకోవాలని షరతు పెడుతున్నాయి. - 8లో▸



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరి జ్యోతి (విశాఖపట్నం) గురువారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 7,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.80 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం
– మాజీ ఎంపీ అనురాధ



సర్పంచ్‌లతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలను కలుపుకుంటూ రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే మన లక్ష్యమని మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్ళమూరులోని ఆమె నివాసంలో గురువారం సర్పంచ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అనురాధ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఏ ఒక్కరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. ఇప్పటి నుంచి ప్రజా సమస్యలపై గళమెత్తుతూ ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలు, పార్టీ నాయకులకు భరోసాగా ఉంటానని చెప్పారు. మనమందరమూ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, డి.చిరంజీవిరావు, సుందరనీడి సాయి, కడలి గంగాచలం, బర్రే సీతారత్నం, కొల్లు వెంకటరమణ, రాకాపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు మల్లాడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా రాజకీయాలపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: 'తూర్పు గోదావరి జిల్లా రాజకీయాలు 1952 – 2022' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. వర్సిటీలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా పని చేసి, ఉద్యోగ విరమణ చేసి ఆచార్య బీవీవీ బాలకృష్ణ ఈ పుస్తకం రచన, సంకలనం చేశారు. క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీలోని వివిధ గ్రంథాలను ఉపయోగించుకుంటూ రచయిత ఈ పుస్తక రూపకల్పన చేశారని వీసీ అన్నారు. దాతల పుస్తక భాండాగారంగా ఉన్న 'నన్నయ భారతి' ద్వారా ఈ పుస్తకాన్ని ప్రచురించారని, ప్రతులు కావలసిన వారు నన్నయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. చరిత్రను భావితరాలకు భద్రంగా అందించడంలో పుస్తక రచనలు ఎంతో తోడ్పడతాయని, చరిత్ర, పూర్వీకుల ఘనత, త్యాగాల గురించి తెలుసుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. రచయిత కృషిని వీసీ, రిజిస్ట్రార్ తదితరులు అభినందించారు.

ధాన్యం డబ్బు చెల్లించండి



అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అమలాపురం రూరల్: ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యం డబ్బు వెంటనే చెల్లించాలని కోరుతూ పలువురు రైతులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అయినవిల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం మండలాలకు చెందిన రైతులు ఇందులో పాల్గొన్నారు. ధాన్యం డబ్బు రాకపోవడంతో ఖరీఫ్ పంటకు పెట్టుబడులు పెట్టలేక, పాత అప్పులు తీర్చలేక, వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు వినతిపత్రం ఇస్తే సొమ్ము వస్తుందని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకూ జమ కాలేదని పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లోగా తమ ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ చేయకపోతే ఖరీఫ్‌లో క్రాప్ హాలిడే ప్రకటిస్తామని తెలిపారు. తొలకరి పంటకు పెట్టుబడి పెట్టే స్తోమత తమకు లేదని, ఎక్కడా అప్పు పుట్టడం లేదని, ఉన్న బంగారం వస్తువులు బ్యాంకుల్లో తాకట్టులో ఉన్నాయని వివరించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు వాసంశెట్టి రామచంద్రరావు, బొక్కా ఏడుకొండలు, బైరిశెట్టి సుబ్రహ్మణ్యం, కుడుపూడి సూర్యప్రకాశ్, బి.నరసింహరావు, అప్పారి గోపాలరావు, నాయుడు పాల్గొన్నారు.



రాయవరంలో యోగాసనాలు నేర్పిస్తున్న దృశ్యం



అమలాపురంలో యోగా శిక్షణ పొందుతున్న అభ్యాసకులు

ఉపయోగాలెన్నో..

- మానసిక ఒత్తిడి నుంచి విముక్తికి చక్కటి మార్గం
- జిల్లాలో పెరుగుతున్న ఆదరణ
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ఆదేశాలు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

రాయవరం/కొత్తపేట/అమలాపురం టౌన్/అంబాజీపేట: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ప్రతీ ఒక్కరిదీ ఉరుకుల పరుగుల జీవితమే. క్షణకాలం కూడా తీరిక లభించడం లేదు. ఉదయం లేచింది మొదలు.. రాత్రి నిద్రించే వరకూ బిజీ షెడ్యూలే. ఫలితంగా మానసిక ఆందోళన, చిరాకు, వంటి అనారోగ్య సమస్యలు పద్మవ్యూహంలా చుట్టుముడుతున్నాయి. వీటి బాగు కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లభించకపోవడంతో మరింత మానసికంగా కుంగిపోతున్నారు. ఈ క్లిష్ట తరుణంలో అనారోగ్య సమస్యలను పటాపంచలు చేసి, మానసిక ప్రశాంతతను చేకూర్చే దివ్య ఔషధం యోగా. కరకాల మందులు తాత్కాలిక ఉపశమనం అందిస్తే, యోగా మాత్రమే దీర్ఘకాలిక ఊరట అందిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

వేల ఏళ్ల క్రితం

వేల ఏళ్ల క్రితం భారతావనిలో పురుడుపోసుకున్న ఆ మహిమాన్విత సంజీవని యోగా, ధ్యానం గురించి పల్లె నుంచి.. పట్నం వరకు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆసనాలు వేయడంలో మెళకువలను నేర్చుకుంటూ జీవితాల్లో ఆరోగ్యకాంతులు విరబూయించుకుంటున్నారు. శాంతియుత జీవనానికి బాటలు వేసుకుంటున్నారు.

2015 నుంచి యోగా దినోత్సవం

2014 సెప్టెంబర్ 27న భారత ప్రధాని నరేంద్రమోదీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో యోగా అంశాన్ని ప్రస్తావించారు. ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏటా జూన్ 21న జరుపుకోవాలనే అంశాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానానికి 193 ఐక్యరాజ్యసమితి ప్రతినిధులలో 175 మంది ఆమోదం తెలిపారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015 జూన్ 21న నిర్వహించారు. భారతదేశంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ రాజ్‌పథ్‌లో నిర్వహించారు. ఆ వేడుకలకు 84 దేశాల నుంచి వచ్చిన నేతలతో పాటు మొత్తం 35,985 మంది పాల్గొని రెండు గిన్నిస్ రికార్డులు నెలకొల్పారు.

ప్రతీ ఆసనంతో ప్రయోజనం

యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుంది. యోగాభ్యాసంలో భాగంగా ఒక్కో ఆసనం ద్వారా ఒక్కో ఉప'యోగం' ఉంటుంది. పూర్ణ ధనురాసనం, చక్రాసనం, హలాసనం, జానుశీర్షాసనం, పశ్చిమోత్తాసనం, వృష్టాసనం, శలభాసనం, వృశ్చికాసనం నిలబడి, కూర్చుని, బోర్లాపడుకొని, వెల్లకిలా పడుకొనిచేసేవి 19 ఆసనాలున్నాయి. కపాలాబాతి, ప్రాణాయామం, ధ్యానం, సంకల్పం వంటి ఆసనాలున్నాయి. వాటి వలన అభ్యాసకులు రోజంతా ఉత్సాహంగా గడుపుతారు. బీపీ, సుగర్ సమస్యలకు నివారిణిగా ధ్యానం, యోగా పనిచేస్తుంది. ధ్యానంతో మనోవికాసం, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, అలసట లాంటి రుగ్మతలను దూరం చేసుకోవాలంటే యోగా తప్పనిసరి అని శాస్త్రీయంగా కూడా నిరూపితమైందని ఫలితం పొందిన పలువురు చెబుతున్నారు.

అందరిలోనూ ఆసక్తి

జిల్లాలో యోగా నేర్చుకోవాలనే ఆసక్తి అన్ని వయస్సుల వారిలోనూ పెరిగింది. అందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. అమలాపురం, మండపేట, రావులపాలెం, కొత్తపేట, రామచంద్రపురం, రాయవరం, రామచంద్రపురం, ద్రాక్షారామ, రాజోలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు యోగా సెంటర్లలో శిక్షణ పొందేందుకు రోజూ వేల సంఖ్యలో తరలివస్తున్నారు. కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నాయి.

ఏటా యోగా డే నిర్వహణ

విద్యార్థి దశ నుంచే యోగాపై ఆసక్తి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా ఏటా పాఠశాలలు, కళాశాలల్లో యోగా డేను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా యోగాడేను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని సమగ్ర శిక్షా ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు సూర్యనమస్కారాలు వీక్షించేలా వీడియో లింక్‌లను కూడా పంపించారు. పాఠశాలల్లో యోగా డే ప్రాధాన్యం వివరిస్తూ, పాఠశాలల్లో నిర్వహించిన యోగాడే కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను గూగుల్ ట్రాకర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే పలు పాఠశాలల్లో యోగా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నారు. పలువురు ప్రధానోపాధ్యాయులు యోగా గురువులతో ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

దీనికి విద్యార్థుల నుంచి కూడా స్పందన లభిస్తోంది. కొన్ని విద్యా సంస్థలలో ఉదయం, సాయంత్రం వెనులుబాటును బట్టి రోజూ అరగంట విద్యార్థులకు యోగా శిక్షణ అందిస్తున్నారు. తద్వారా చిన్నారులలో క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక పరమైన ఆరోగ్య సమస్యలు దూరమవుతున్నాయని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు.

కోవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన

మూడేళ్ల కిందట జీవితాలను అతలాకుతలం చేసిన కోవిడ్‌తో ప్రజల్లో ఆరోగ్యం విలువ, దానిని కాపాడుకోవాలన్న ధ్యాస బాగా పెరిగింది. ముఖ్యంగా మహిళలు యోగా కేంద్రాల బాట పడతున్నారు. యువతీ యువకులు జిమ్‌ల కంటే యోగా కేంద్రాల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు యోగా కేంద్రాలకు వచ్చే కొద్దిమంది తమ బాడీ ఫిట్‌నెస్ కోసం వస్తే..ఇప్పుడు తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు యోగాలో ఉన్న హెల్త్ టిప్స్‌ను ఆసనాల ద్వారా అలవర్చుకుంటున్నారు.

నాలుగు ప్రధాన పద్ధతులు

యోగా ప్రక్రియలో వందలాది ఆసనాలు ఉన్నప్పటికీ ఆరోగ్యపరంగా కొన్ని ప్రత్యేక ఆసనాలను అనుసరిస్తున్నారు. ప్రధానంగా యోగాలో నాలుగు ప్రధాన పద్ధతులు ఉన్నాయి. రాజయోగం, క్రియా యోగం, హట యోగం, భక్తి యోగంగా ఆ నాలుగు పద్ధతులు అమలవుతున్నాయి. ఇందులో రాజయోగం ప్రాణాయామం, ధ్యానం, ఊపిరికి సంబంధించిన హెల్త్ టిప్స్‌ను సూచిస్తే, క్రియా యోగంలో శరీర సౌష్టవానికి సంబంధించిన ప్రక్రియలు ఉంటాయి. మూడోది హట యోగం పూర్తిగా వైద్యపరంగా, చికిత్సల పరంగా ఉపయోగపడుతుంది. నాలుగోది భక్తి యోగం. ఇందులో ఆధ్యాత్మిక వికాసంతోపాటు ఏకాగ్రత, ధ్యాన సాధన ఇమిడి ఉంటాయి.

ఆరోగ్యం పదిలం

- యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నవారు తమ విధులపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారు. తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు, మానసిక ఆందోళనలతో సతమతమయ్యేవారు.
- యోగా పై దృష్టి సారించడం శ్రేయస్కరమని నిపుణులు పేర్కొంటున్నారు. యోగా ద్వారా శాంతియుత జీవనం సాధ్యమంటున్నారు.
- యోగాలో ధ్యానానికి సంబంధించి న ఆసనాలు వేయడం వల్ల శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది. రోజూ ధ్యానం చేస్తే శ్వాస పరమై న ఇబ్బందులు క్రమంగా తొలగిపోతాయని యోగా నిపుణులు తెలుపుతున్నారు.
- నిత్యం యోగా వల్ల విద్యార్థులలో జ్ఞాపక శక్తి పెంపొందుతుంది. తద్వారా చదువులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.
- యోగాసనాల వల్ల శరీరంలో కీలక రక్తప్రసరణ వ్యవస్థ ఉత్తేజమవుతుందని, ఫలితంగా అనారోగ్య సమస్యలు దరి చేరవని విశ్లేషకులు చెబుతున్నారు.



అవగాహన పెరిగింది



శిక్షణ పొందుతూ ఫలానా ఆరోగ్య సమస్య పరిష్కారమైందన్న మాటలు శిక్షకుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. మహిళలు, యువకులు ఎక్కువగా నేడు యోగా కేంద్రాలకు వస్తున్నారంటే యోగాతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాల పట్ల వారిలో అవగాహన పెరగడమే కారణం.

– డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, యోగా గురువు, అమలాపురం

12 ఏళ్లుగా ఉచిత శిక్షణ

కొత్తపేట, అంబాజీపేట, రావులపాలెం, నరేంద్రపురం, అమలాపురం తదితర ఎనిమిది ప్రాంతాల్లో 12 ఏళ్ల నుంచి శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమాలు నిర్వహిస్తూ ఉచితంగా యోగా నేర్పిస్తున్నారు డాక్టర్ శ్రీనివాసరావు. అంబాజీపేట మండలం చిరతపూడికి చెందిన ఈయన పదిమంది ఉంటే చాలు యోగా నేర్పేందుకు వస్తానని చెబుతున్నారు. యోగా ఆశ్రమం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు వారానికి రెండు రోజులు అన్నదానం చేస్తున్నారు. ఆశ్రమం ద్వారా ఆరు వేలకు పైగా రక్తదానాలు చేశారు. 2017 కేరళలోను, 2019 ఢిల్లీలోను జాతీయ స్థాయి యోగా ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. వివిధ సేవా సంస్థల ద్వారా పురస్కారాలు లభించాయి.



ఆసనం వేస్తున్న యోగా గురువు శ్రీనివాస్

రోజూ గంట కేటాయించండి



రోజూ గంట సమయం యోగాకు కేటాయించండి. తద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరి చేరవు. నిత్య యోగాతో కరోనాను సైతం ఎదుర్కొనే శక్తి వస్తుందని నిరూపించాను. రోజూ గంట సమయం ధ్యానం, ప్రాణయామం, సూర్య నమస్కారం చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. ప్రతి రోజు ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నాను.

– వెలగల ఫణికృష్ణారెడ్డి, యోగా గురువు, రాయవరం

ఆత్మస్థైర్యం పెరుగుతుంది



యోగా సాధనతో ఎంతటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం అలవడుతుంది. అదే ధైర్యంతో జీవితంలో ఎటువంటి కష్టాలనైనా సులభంగా ఎదుర్కొనే సత్తా పెరుగుతుంది. యోగాను ఇష్టపడి సాధన చేస్తే అటు చదువుతో పాటు అన్ని రంగాల్లో ఏకాగ్రత పెరుగుతుంది. విద్యార్థి దశ నుంచి యోగా సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుంది. యోగా సాధనతో వ్యాధులను సైతం నయం చేసుకోవడానికి ఆస్కారం ఉంది.

– అల్లూరి శ్రీనివాసచౌదరి, యోగా శిక్షకులు, లొల్ల, రాయవరం మండలం

సేవా దృక్పథంతో..



అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవనం సాగించాలనే స్వామి వివేకానంద యోగా శిక్షణ కేంద్రాన్ని స్థాపించాను. ఇంతవరకు సుమారు 15 వేల మంది శిక్షణ పొందారు. వారిలో పలువురు పీఈటీ, యోగా టీచర్స్‌గా ఉద్యోగాలు పొందారు. ప్రస్తుతం సుమారు 580 మంది శిక్షణ పొందుతున్నారు.

– ఆకుల శ్రీనివాస్, యోగా మాస్టర్, స్వామి వివేకానంద యోగా శిక్షణ కేంద్రం, కొత్తపేట

దీన్ని మించిన వైద్యం లేదు



శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాను మించిన వైద్యం లేదు. ఆనందకర జీవితానికి యోగా ఎంతగానో దోహదపడుతుంది. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా యోగా అభ్యసిస్తే జీవితం ఆనందంగా సాగుతుంది.

– నల్లా సత్యనారాయణమూర్తి (నల్లా మాస్టార్), రిటైర్డ్ పీఈటీ అండ్ ఎన్‌సీసీ ఆఫీసర్, కొత్తపేట

రెవెన్యూ శాఖ తల్లి లాంటిది

– కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ప్రభుత్వ శాఖలకు రెవెన్యూ శాఖ తల్లి లాంటిదని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడం, పేదవాడికి వ్యవసాయ భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ, సామాన్యుడి జననం నుంచి మరణం వరకు కావలసిన ధ్రువపత్రాలు మంజూరు చేస్తుందని అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ దినోత్సవం సిబ్బంది, రైతులతో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16వ శతాబ్దంలో బ్రిటిష్ హయాంలో భూమిశిస్తును రెవెన్యూ ఉద్యోగులు సేకరించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. రెవెన్యూ శాఖ ముందు వరుసలో ఉండి ఇతర శాఖల సమన్వయంతో ప్రజలను ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడి ప్రాణ ఆస్తి నష్టాలను నివారిస్తుందన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు అయిందని 238 ఏళ్ల తర్వాత ఏపీలో రెవెన్యూ డే ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. రెవిన్యూ శాఖ చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ బ్రిటిష్ కాలంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు మాత్రమే ఉండేవని జమాబందీ నీటి తీరువా వసూళ్ల సమయంలో తహసీల్దారులకు పోలీస్ అధికారులు రక్షణగా వ్యవహరించే వారని తెలిపారు. పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన 32 మంది ఉద్యోగులకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు కలెక్టర్ శుక్లా చేతుల మీదుగా బహూకరించి సత్కరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ మాట్లాడుతూ రెవెన్యూ విభాగం ద్వారా సుమారుగా 88 రకాల సేవలను అందిస్తున్నామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఈ రెండు సంవత్సరాల కాలంలో రెవెన్యూ పరంగా చేసిన సేవలను వివరించారు. అమలాపురం ఆర్డీవో జి.కేశవవర్ధన రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదనమోహన్ రావు, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మద్దతుపై పెదవి వరిపు

- పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా పెరగలేదంటున్న రైతులు
- క్వింటాల్‌కు రూ.117 పెరుగుదల
- జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్
- మరో 1.60 లక్షల ఎకరాల్లో రబీ
- రెండు పంటలు కలిపి సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 80 శాతం ధాన్యానికి కనీస మద్దతు ధర

సాక్షి అమలాపురం: కేంద్ర ప్రభుత్వం వరికి కనీస మద్దతు ధరను ప్రకటించింది. క్వింటాల్‌కు రూ.117 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల జిల్లాలో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులకు కొంత వరకు ఊరట కలిగింది. ఏటా ఖరీఫ్ సాగు ఆరంభంలో వరితో పాటు పలు రకాల పంటలకు కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సిఫారసు మేరకు రూ.117 పెంచింది. సాధారణ రకంతో పాటు గ్రేడ్-ఏ రకానికి సైతం ఇదే ధరను పెంచారు. దీంతో ఇప్పటి వరకు సాధారణ రకం క్వింటాల్ రూ.2,183 ఉండగా ఇప్పుడు రూ.2,300 కు పెరిగింది. గ్రేడ్ –ఏ రకం రూ.2,203 ఉండగా ఇప్పుడు అది రూ.2,320 కి పెరిగింది. దీంతోపాటు జిల్లాలో అధికంగా సాగు చేసే మొక్కజొన్న, వేసవిలో అపరాలుగా సాగు చేసే పెసలు, మినుముతో పాటు నువ్వులు ధరలను సైతం కేంద్ర ప్రభుత్వం పెంచింది. పెసలు క్వింటాల్‌కు రూ.124 చొప్పున పెంచగా రూ.8,558 ఉన్న పెసలు క్వింటాల్ ధర రూ.8,682 కు పెరిగింది. ఇక మినుములు క్వింటాల్‌కు రూ.450 చొప్పున పెంచారు. దీంతో రూ.6,950 వరకు ఉన్న ధర రూ.7,400 కు పెరిగింది. నువ్వులు క్వింటాల్‌కు రూ.632 వరకు పెరిగింది. దీంతో రూ.8,635 ఉన్న ధర రూ.9,267 కు చేరింది.

ఈ పెంపు లాభసాటి కాదు

జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాలలో అత్యధికంగా వరి సాగు జరుగుతున్న విషయం తెలిసిందే. మొత్తం 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. రబీలో 1.60 లక్షల ఎకరాలలో వరి సాగవుతోంది. ఖరీఫ్‌లో సగటున 29 బస్తాల చొప్పున 21.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తోంది. జిల్లాలో ఖరీఫ్‌లో 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగబడిగా వస్తుంది. ఇక రబీలో సగటు దిగుబడి 33.75 మెట్రిక్ టన్నుల చొప్పున 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తుంది. జిల్లాలో ఖరీఫ్, రబీ కలిపి 8.94 మెట్రిక్ టన్నులకు పైబడి ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. వరికి కనీస మద్దతు ధర పెంచడం వల్ల తమకు కొంతవరకు మేలు జరుగుతుంది కాని ఈ పెంపు లాభసాటి కాదని రైతులు అంటున్నారు. పెరిగిన పెట్టుబడులకు తగిన విధంగా మద్దతు ధర పెంచలేదని రైతులు చెబుతున్నారు.



నాడు ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కనీస మద్దతు ధర అందేలా పలు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఆర్‌బీకేలను కొనుగోలు కేంద్రాలుగా మార్పు చేసి ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించింది. 2014–19లో టీడీపీ ప్యాడీ పర్చేజింగ్ సెంటర్ (పీపీసీ)లు ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు పెద్దగా జరగలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైతం ఎప్పుడూ లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేసిన సందర్భం లేదు. కాని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా కోనసీమ జిల్లాలోనే పలు సందర్భాలలో రెండు నుంచి మూడు లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. ఇలా ఆర్‌బీకేల ద్వారా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడంతో పోటీగా ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు సైతం కనీస మద్దతు ధర కన్నా అధిక ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వంలో వచ్చే ఖరీఫ్ నుంచి ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

క్లుప్తంగా

రెండు కేసుల నమోదు

అమలాపురం టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు ద్రాక్షారామ, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం రెండు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ ఈబీ అధికారులు దాడులు నిర్వహించి అక్రమ మద్యంతో ఉన్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.4,798 విలువైన మూడు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న బృందంపై దాడి చేసి అయిదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.20,770 నగదును ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండల పరిధిలోని వెలిచేరుకు చెందిన బొల్లా వెంకన్న (47) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై ఎస్.శ్రీనివాసు కథనం ప్రకారం కూలిపనికి వెళుతూ జీవనోపాధి పొందుతున్న వెంకన్న ఇటీవల కాలంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఈ నెల 19న పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెరచుకున్న దుఃఖాణాలు

- ప్రైవేటు స్కూళ్లలో సైడ్ బిజినెస్
- పెన్సిల్ నుంచి నోట్‌బుక్స్ వరకు ధరల బాదుడు
- వారు చెప్పిందే ధర, ఇచ్చినవే బుక్స్
- అడ్డూ, అదుపూ లేని దోపిడీ
- బెంబేలెత్తుతున్న సామాన్యులు
- ఎన్ని ఫిర్యాదులు చేసినా తనిఖీలు చేయని విద్యాశాఖ

కాకినాడ సిటీ: జిల్లాలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తుండగా బుక్స్, బ్యాగు, చివరికి షూ సైతం తమ పాఠశాలలోనే తీసుకోవాలనేది ఆ యాజమాన్యాల ఆదేశం. బుక్స్ ఇతర మెటీరియల్ కలిపి రూ.10 వేల నుంచి రూ.14 వేలు దాటుతున్నాయి. వాటి ధర మార్కెట్లో రూ.5 వేలే. ఇదేమని అడిగితే ఇవి తీసుకుంటేనే ఇక్కడ చదవాలనే కండిషన్, లేకుంటే నో అడ్మిషన్, బయటి బుక్స్ తెస్తే, నో పర్మిషన్, జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ స్కూళ్లలో పరిస్థితి ఇదే...

జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు. నియంత్రణ లేని ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే అభిప్రాయంతో నగర పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తమ పిల్లలను నగంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్, మెయింటినెన్స్, స్పెషల్ ఫీజులు అంటూ రక్తం పీలుస్తున్నాయి. పలు ప్రైవేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు కొనాలని ఆదేశిస్తూ తమ పాఠశాల పేర్లతో ఉన్న బ్యాగులను సైతం విక్రయిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు మొదలు, బ్యాగులు, టై, బూట్లు, షూ వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లా అధికారులు కొలువుండే కాకినాడ నగరంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉందో చెప్పనవసరం లేదు. పాఠశాలలు పునః ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా విద్యాశాఖ మాత్రం ఎలాంటి తనిఖీలు చేయడం లేదు.

ఆకాశంలో బ్యాగుల ధరలు

నర్సరీ నుంచి పదో తరగతి వరకే కాకుండా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకూ బ్యాగు తప్పనిసరైంది. చాలా కంపెనీలు విద్యార్థులను ఆకర్షించేలా వారి అవసరాలకు తగ్గట్టుగా అనేక మోడల్స్‌లో బ్యాగులను విడుదల చేస్తున్నాయి. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు కొన్ని పుస్తకాలు ఉంటాయి. 6 నుంచి 10వ తరగతి వారికి మాత్రం కచ్చితంగా నాణ్యమైన బ్యాగు లేనిదే ముందుకు కదలలేని పరిస్థితి. చిన్న పిల్లల బ్యాగులు దాదాపు రూ.250 నుంచి రూ.600 వరకు, ఆరో తరగతి చదివే పిల్లలకు దాదాపు రూ.1,000 వరకు బ్యాగుల ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం బ్యాగుల ధరలు గతంలో పోల్చితే దాదాపు రూ.310 వరకు పెరిగాయి.

పుస్తకాల ధరలు పైపైకి..

బయట షాపుల్లో ఓ పుస్తకం ధర రూ.20 ఉంటే పాఠశాలలో రూ.25 నుంచి రూ.30 వరకు ఉంటుంది. ఇంకొన్ని పాఠశాలల్లో అయితే రూ.40 కన్నా ఎక్కువగా ఉంటుంది. ఒకటో తరగతికి సంబంధించి 11 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,220, 13 నోట్‌బుక్స్‌కు రూ.530 మొత్తం రూ.1,750 వసూలు చేస్తుండగా, కొన్నిచోట్ల రూ.5 వేలకు పైగానే తీసుకుంటున్నారు. రెండో తరగతి 11 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,850, 21 నోట్ బుక్స్‌కు రూ. 760 మొత్తం రూ.2,610 కాగా, మరికొందరు రూ.6 వేలు తీసుకుంటున్నారు. మూడో తరగతి 10 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,990, 22 నోట్‌బుక్స్‌కు రూ.660, మొత్తం రూ. 2,560 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. వీటికి తోడు పెన్నులు, పెన్సిళ్లు, కవర్లు అంటూ రెట్టింపు ధరలకు అంటగడుతున్నారు.



యూనిఫాం అటువైపుగానే..

విద్యార్థులు తప్పనిసరిగా యాజమాన్యం సూచించిన యూనిఫాంనే ధరించాల్సిందే. వీటి ధరలు కూడా గత సంవత్సరంతో పోల్చితే చాలా పెరిగాయి. క్రితం ఏడాది నర్సరీ పిల్లలకు కావల్సిన స్కూల్ యూనిఫాం దాదాపు రూ.600 నుంచి రూ.850 వరకు ఉండగా ఇప్పుడు రూ.1,000 నుంచి రూ.1,200 చేరుకుంది. ఒక విద్యార్థికి కనీసంగా రెండు యూనిఫాంలు ఉండాలి. లేదంటే ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి జతను కొనుక్కోవడం, కుట్టించుకోవడం తప్పనిసరి. జిల్లా కేంద్రంలో చాలా దుకాణాల్లో రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది రెడీమేడ్ దుస్తులను వాడితే మరి కొంతమంది కొనుక్కొని కుట్టించుకుంటున్నారు.

భగ్గుమంటున్న బూట్ల ధరలు

ప్రతీ పాఠశాలలో యూనిఫాం దానికి తగ్గట్టుగా బూట్లు బ్లాక్ కలర్, వైట్ కలర్ తప్పనిసరిగా ఉండాల్సిందే. పలు పాఠశాలలు తప్పనిసరిగా బ్రాండెడ్ కొనుగోలు చేయాలని చెబుతున్నాయి. గతేడాది పలు కంపెనీలకు చెందని బూట్లు దాదాపు రూ. 300 నుంచి రూ.450 వరకు ఉండగా ఇప్పుడు 10 నుంచి 20 శాతం వరకు పెరిగి కనీసం రూ.750 లేనిదే మంచి బూట్లు రాని పరిస్థితి నెలకొంది.



బ్యాగులు



బూట్లు

నిబంధనలు ఉల్లంఘించొద్దు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. పాఠ్య పుస్తకాలు, తదితర వస్తువులు అధిక ధరలకు అమ్మడం నిబంధనలకు విరుద్ధం. ఫీజుల విషయంలో జీవోలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందే. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మడానికి వీలులేదు. అలాంటివి జరిగితే మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన శివారు రేవువారిపేటలో చిల్లా లక్ష్మి (55) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కాట్రేనికోన ఎస్సై బి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనికోన శివారు కంచువారిపేటకు చెందిన నల్లా పెదసత్యనారాయణ కుమార్తె లక్ష్మిని, రేవువారిపేటకు చెందిన చిల్లా కృష్ణకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. మృతురాలి లక్ష్మి కొంతకాలం పాటు గల్ఫ్‌లో ఉంది. రెండేళ్ల క్రితం రేవువారిపేట సొంత ఊరు వచ్చేసింది. అయితే ఈమెకు అనారోగ్య సమస్యలు ఉండడంతో ఉదయం ఇంటి వద్ద హఠాత్తుగా ముందుకు పడిపోయింది. ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని మృతురాలి భర్త కృష్ణ తెలిపారన్నారు. అయితే తన కుమార్తె లక్ష్మిని భర్త కృష్ణ చంపేశాడని ఆరోపిస్తూ నల్లా పెదసత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు పంపామని ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

బస్సును ఢీకొట్టిన కారు

యువతికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: పట్టణ శివారున ఏబీఎన్ అండ్ పీఆర్ కళాశాల సమీపంలో కొవ్వూరు నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా డివైడర్‌కి అవతలి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. వేగంగా వస్తున్న కారు డివైడర్ ఎక్కి మరోవైపు వెళుతున్న బస్సుపైకి దూసుకెళ్లింది. దీంతో ఆకస్మికంగా బస్సు బ్రేక్‌వేయడంతో బస్సు ముందు భాగంలో కూర్చున్న సీహెచ్ శిరిష అనే యువతి తీవ్ర గాయాలపాలైంది. బస్సుకి ఉన్న అద్దాలు పగిలిపోయి యువతి బస్సు ముందు పడిపోవడంతో శిరిష తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు రెండు అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదని పట్టణ పోలీసులు చెప్పారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

- ముగిసిన శ్రీవారి కల్యాణోత్సవాలు
- ఘనంగా ద్వాదశ ప్రదక్షిణలు

మామిడికుదురు: శ్రీనివాసా గోవిందా, శ్రీ వేంకటేశా గోవిందా అంటూ భక్తుల కోలాహలం నడుమ అయిదు రోజుల పాటు కనుల పండువలా సాగిన అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం శ్రీపుష్పయాగంతో సంపూర్ణమయ్యాయి. పచ్చని పందిళ్లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల కాంతులు, పలు రకాల పుష్పాల సోయగాల నడుమ శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీబాల బాలాజీ స్వామి భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ద్వాదశ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయి. వేద పండితులు భక్తులతో కలిసి 12 పర్యాయాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. 12 రకాల మంగళ వాయిద్యాలు, 12 రకాల ప్రసాదాలతో ఈ కార్యక్రమం ఆద్యంతం వైభవోపేతంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో చివరి అంకంగా స్వామి వారి శ్రీపుష్పయాగం (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. శ్రీపుష్పయాగంలో పాల్గొన్న దంపతులకు ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామి వారి తరఫున తాంబూలాలు అందించారు. పసుపు, కుంకుమ, రవికల గుడ్డ అందజేశారు. ముందుగా సుప్రభాత సేవతో అయిదో రోజు శ్రీబాల బాలాజీ స్వామి వారిని మేల్కొలిపారు. దేవస్థానం ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి సహస్ర నామార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. బాల భోగం, నివేదన, వేద పారాయణం హృద్యంగా ఆలపించారు. వేద మంత్రోచ్చారణల నడుమ నిత్యహోమం, నిత్యారాధన, మంగళ శాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, తదితర కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు. దేవస్థానం కార్య నిర్వహణాధికారిణి గ్రంధి మాధవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఆద్యంతం కనుల పండువలా జరిగాయి.



స్వామివారి శ్రీపుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

లే అయ్యా.. పనికి వెళదాం

- కారు ఢీ కొని వ్యవసాయ కూలీ మృతి
- మృతదేహం వద్ద హృదయ విదారకంగా విలపించిన భార్య

అంబాజీపేట: పనికి వెళ్లే వేళయ్యింది.. లే అయ్యా త్వరగా కూలి పనికి పోదామంటూ మృతుని వద్ద భార్య రోదిస్తున్న తీరు చూపరులకు కంట తడిపెట్టించింది. అప్పటి వరకు కలిసి భార్యాభర్తలిద్దరూ ఇంటి వద్ద ఆనందంగా గడిపి పనికి వెళుతుండగా మార్గ మధ్యలో ఆమె భర్తను కారు రూపంలో మృత్యువు కాటేసింది. కముజువారిలంకలో గురువారం మధ్యాహ్నం వ్యవసాయ పని చేసుకునేందుకు భార్యతో కలిసి నడచి వెళుతున్న ఓ కూలీని కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కముజువారిలంకకు చెందిన విత్తనాల నాగేశ్వరరావు (58) తన భార్య వెంకటలక్ష్మితో కలిసి వ్యవసాయ కూలి పనికి వెళుతున్నాడు. ఈ సమయంలో ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళుతున్న కారు నాగేశ్వరరావును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దాంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది నాగేశ్వరరావును పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారని, అతని మృతితో వెంకటలక్ష్మి పరిస్థితి ఏమిటోనని స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. ఇదిలా ఉండగా తన ఎదుటే భర్త మృతి చెందడంతో వెంకటలక్ష్మి బోరున విలపిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



నాగేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

ఇసుక దోపిడీని అరికట్టాలి

డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్



మండపేట: మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో యథేచ్ఛగా జరుగుచున్న ఇసుక దోపిడీని తక్షణం అరికట్టాలని ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఆయన మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధించిన ఇసుక ర్యాంపుల గట్లపై లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇసుక నిల్వ చేసిందన్నారు. ఆ గుట్టలపై కూటమి నాయకుల కన్ను పడి దోపిడీకి తెర తీశారని అన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఫ్రీ ఇసుక విధానం తీసుకొస్తానని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలోని మీ నాయకులు అయినకాడికి దోచుకుతిన్నాక గాని ప్రభుత్వ పాలసీని అమలు చేయరా అని దుయ్యబట్టారు. ఐదు రోజులుగా రాత్రిపగలు తేడా లేకుండా జరుగుతున్న ఇసుక దోపిడీని కలెక్టర్ అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మిన్నకుండి పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు తాను జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశానని వెల్లడించారు. ఇసుక నిల్వలను ఇష్టానుసారం దోచుకుపోతే ఈ వర్షాకాలంలో ఏర్పడే ఇసుక కొరతను ఎవరు భర్తీ చేస్తారని ప్రశ్నించారు.


అచ్చెన్నాయుడూ.. ప్రభుత్వం మీ ఒక్కరి సొత్తేం కాదు..

ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను కామన తీవ్రంగా ఖండించారు. టీడీపీ కార్యకర్తలు పసుపు బిళ్లతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే అధికారులు మర్యాదలు చేసి మరీ చెప్పిన పని చేస్తారని అనడం సరికాదన్నారు. ప్రభుత్వం ఏ ఒక్క పార్టీకో లేక ఏ ఒక్కో నాయకుడికో సంబంధించింది కాదన్నారు. ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

పవన్ నిర్ణయం అన్యాయం

- ఉపాధి హామీ నిధులు దారి మళ్లించడం తగదు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉపాధి హామీ పథకం నిధులు హార్టికల్చర్‌కి అనుసంధానం చేస్తూ సంతకం చేయడం అన్యాయమని, దీనిపై పునరాలోచన చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది కూలీలు పని చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అటు మెటీరియల్‌కు, ఇటు హారికల్చర్ వంటి పనులకు 80 శాతం నిధులు మళ్లిస్తున్నాయని అన్నారు. ఇక ఉపాధి కూలీలకు పనులు ఏ నిధులతో కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. దీనివల్ల వ్యవసాయ కార్మికులందరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలన్న లక్ష్యం పక్కదారి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకానికి దేశవ్యాప్తంగా రూ.రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పథకంలో అనేక పనులను కుదించారని కోనసీమ లాంటి ప్రాంతాల్లో చేపట్టేందుకు కేవలం పంటకాలువలు, మురుగు డ్రైన్ల పనులు మాత్రమే ఉన్నాయని, జంగిల్ క్లియరెన్స్, గుర్రపుడెక్క పనులను తొలగించారని చెప్పారు. 200 రోజులు ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించే ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలమూరి శ్రీనివాసరావు, పెట్టా ఆనందరావు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

అమెరికా వెళ్లేందుకు ఉత్తమ మార్గదర్శకత్వం

జేఎన్‌టీయూకే ఉపకులపతి ప్రసాదరాజు

కాకినాడ సిటీ: విదేశాలల్లో స్థిరపడిన జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థులను యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు వారి ఆహ్వానం మేరకు చేపట్టిన అమెరికా ప్రయాణం విజయవంతమైందని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పర్యటన ద్వారా పూర్వ విద్యార్థుల లతో యూనివర్సిటీ సంబంధాలు మెరుగుపడ్డాయన్నారు. తద్వారా ఉన్నత విద్యనభ్యసించేందుకు అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకత్వం లభిస్తుందన్నారు. ప్రాయోజిత పరిశోధనా ప్రాజెక్టుల ద్వారా పరిశ్రమల సహకారాన్ని పొందడంతో పాటు విద్యార్థులకు మెరుగైన ఇంటర్న్‌షిప్స్ లభిస్తాయన్నారు. యూఎస్ విశ్వవిద్యాలయాలతో కలిసి ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా జాయింట్ ఎంఎస్ ప్రోగ్రామ్‌లు నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడతామని వివరించారు. జేఎన్‌టీయుకే క్యాంపస్‌లో విద్యా వాతావరణాన్ని మరింత మెరుగు పర్చేందుకు కాలిఫోర్నియా రాష్ట్రానికి చెందిన పూర్వ విద్యార్థులు తమ సహకారం అందించనుండడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీకి న్యాక్ ఏ+, కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం, విద్యార్థులకు మెరుగైన ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందడంపై ఆనందం వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా యూనివర్శిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్రా, యూనివర్శిటీ ఆఫ్ మిస్సోరీ, టెక్సాస్ ఏ అండ్ ఎం, చికాగో స్టేట్ యూనివర్శిటీ సందర్శించడంతో పాటు చికాగోలోని కాన్సులేట్ జనరల్‌ను కలిశానన్నారు. పూర్వ విద్యార్థులైన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కావడంతో పాటు వోజిక్ ఏఐలో ఇంటర్న్‌షిప్ అందించేందుకు ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థి డాక్టర్ వాసు తదితరులకు అభినందనలు తెలిపారు. యూఎస్ పర్యటనకు తనతో పాటు యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, కెనడా నుంచి ప్రొఫెసర్ జీవీఆర్ మూర్తిలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం వెళ్లినట్టు తెలిపారు. జేఎన్‌టీయూకే ప్లాటినం జూబ్లీ అండ్ అలూమ్ని సెంటర్ నిర్మాణానికి పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సీతా ముత్యాలభాస్కరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు వీసీ ప్రసాదరాజు వివరించారు.

కొత్త రకాల సాగులో జాగ్రత్తలు

- ఖరీఫ్‌లో ఎంటీయూ 1310, ఎంటీయూ 1275 సిఫారసు
- వీటికి చీడ పీడలను తట్టుకునే సామర్థ్యం
- ప్రయోగాత్మకంగా పరిశీలన అనంతరం నిర్ధారణ
- జిల్లా సాంకేతిక సలహా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ నంద కిషోర్



ఎంటీయూ 1310 రకం నారుమడి

పాడి-పంట

అమలాపురం రూరల్: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మార్టేరు రూపొందించిన ఎంటీయూ 1310, ఎంటీయూ 1275 రకాలను ఈ ఖరీఫ్ కోసం సిఫారసు చేస్తున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సాంకేతిక సలహా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ నంద కిషోర్ తెలిపారు. ఇందులో ఎంటీయూ 1310 రకం, 140 రోజులు కాల పరిమితి కలిగి ఎకరానికి 35-40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. గింజ రాలిక తక్కువ వుండి, అగ్గి తెగులును, మెడ విరుపు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. ఎంటీయూ 1275 రకం, 140 రోజులు కాల పరిమితి కలిగి ఎకరానికి 35-40 బస్తాల వరకు దిగుబడి ఇస్తుంది. కాండం ధృడంగా వుండి, చేను పడిపోదు, గింజ రాలిక తక్కువ. గింజ మధ్యలో సన్నగా వుండి, బియ్యం పారదర్శకంగా ఉండి, ఎక్కువ నిండు గింజలు కలిగి ఉంటుంది. తక్కువ నత్రజనితో అధిక దిగుబడి నిచ్చే ఈ రకం అగ్గి తెగులు, మెడ విరుపు, ఎండాకు, గోధుమ మచ్చ తెగులును కొంత వరకు తట్టుకుంటుంది.

నారుమడి పెంపకంలో సూచనలు

- నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి, చదును చేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని అంటే సుమారు 5 కిలోల యూరియా (విత్తనం చల్లే ముందు 2.5 కిలోలు, విత్తిన 10-15 రోజులకు మరొక 2.5 కిలోలు వేయాలి.) కిలో భాస్వరం అంటే 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1 కిలో పొటాష్ అంటే 2 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలి.
- ప్రతి 5 సెంట్ల నారుమడికి 25 కిలోల విత్తనం, విత్తన శుద్ధి చేసి మొలక కట్టి చల్లాలి. నారుకు ఒక ఆకు పూర్తిగా విచ్చే వరకు ఆరుతడిగా నీరు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిల్వ కట్టాలి.

పొడి విత్తన శుద్ధి

- ఒక కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజిమ్ పొడి మందును విత్తనానికి పట్టించి 24 గంటలు నాన బెట్టి, 24 గంటలు మండి కట్టి, నారుమడిలో చల్లు కోవాలి.

తడి విత్తన శుద్ధి

- లీటరు నీటికి గ్రాము కార్బెండజిమ్ పొడి మందును కలిపి, అందులో కిలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టి, 24 గంటలు మండి కట్టి, నారుమడిలో చల్లు కోవాలి. ఈ విధంగా చేయటం వల్ల నారుమడి దశలో ఆశించే తెగుళ్లను చాలావరకు నివారించవచ్చు.

సస్య రక్షణ

- ఇక నారుమడిలో ఆశించే కాండం తొలిచే పురుగు, ఉల్లి కోడు, హిస్పా పురుగు నివారణకు విత్తిన 10 రోజులకు కార్బొఫ్యురాన్ 3 జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున నారుమడిలో పలుచగా నీరు వుంచి చల్లాలి లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ. లేదా క్లోరిఫైరిపాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు ఒకసారి, 17 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బొఫ్యురాన్ 3 జి గుళికలు ఇసుకలో కలిపి నారుమడిలో పలుచగా నీరు వుంచి చల్లాలి.

కలుపు నివారణ

- నారుమడిలో గడ్డి జాతి కలుపు నివారణకు పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 10శాతం డబ్ల్యూపీ 80 గ్రాములు, లేదా ప్రిటిలాక్లోర్ ఫ్లస్ సెఫ్నర్ 400 మి.లీ. ఒక ఎకరానికి చొప్పున 20 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 3-5 రోజుల లోపు చల్లుకోవాలి.
- నారుమడిలో గడ్డి జాతి వెడల్పాకు కలుపు నివారణకు బిస్ పైరీబాక్ సోడియం 108 ఎస్.ఎల్. 100 మి.లీ. ఒక ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 15-20 రోజులకు చల్లాలి. రైతులు పైన తెలిపిన సూచనలు పాటిస్తూ ఆరోగ్య వంతమైన నారును పెంచుకోవాలని ఆయన సూచించారు.